ప్రజాశక్తి
శనివారం 21 డిసెంబర్ 2024
5
విజయనగరం



ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ అభిప్రాయ సేకరణ

విజయనగరం కోట : జిల్లాలో చేపడుతున్న ధాన్యం సేకరణపై కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం రైతులతో ఫోన్లో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. గోనె సంచుల సమస్య లేమైనా ఉన్నాయా? అమ్మకాలపై ఏమైనా సమస్యలున్నాయా? డబ్బులు సక్రమంగా అందుతున్నాయా వంటి ప్రశ్నలు వేశారు. ఎటువంటి సమస్యలూ లేవని రైతులంతా సానుకూలంగా తెలిపారు. గంట్యాడ మండల కేంద్రానికి చెందిన సుంకరి రామునాయుడుతో మాట్లాడగా ధాన్యం సేకరణ సజావుగా జరిగిందని, తనకు మద్దతు ధర క్వింటాకు రూ.2300 లభించిందని , 48 గంటల్లోనే డబ్బులు ఖాతాకు జమ అయ్యాయని తెలిపారు. బీపురపల్లి మండలం పోతయ్యవలస గ్రామానికి చెందిన గణపతిరాజు వెంకట సూర్యనారాయణ రాజుతో మాట్లాడగా తన దగ్గర అవసరమైన గోనె సంచులు ఉన్నాయని, వాటితోనే ధాన్యం సరఫరా చేయగా గోనె సంచులకు సంబంధించిన ఖర్చులు తన బ్యాంక్ ఖాతాలో జమ చేశారని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇచ్చిన ఐదు గంటల్లోనే నగదు జమ అయ్యిందని తెలిపారు. గరివిడి మండలం, కొండశిర్లపురంనకు చెందిన సేనాపతి సరోజినితో మాట్లాడగా 2 రోజుల్లోనే డబ్బులు పడ్డాయని, ఎటువంటి సమస్యా తలెత్తలేదని తెలిపారు.



గరికిపేటలో పొలంలో నీటమునిగిన వరిచేను



తడిసిన వరిచేను కుప్పలుగా వేస్తున్న రైతులు

ఎడతెరపిలేని వాన

అన్నదాత అవస్థలు • 56.3 మి.మీ వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రతరం కావడంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు గురువారం సాయంత్రం నుంచి ఎక్కువయ్యాయి. జిల్లా అంతటా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 19 ఉదయం 8.30గంటల నుంచి 20వ తేదీ ఉదయం 8.30గంటల వరకు జిల్లాలో సగటున 30.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, 20వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం 6గంటల వరకు 26.2మి.మీ వర్షం కురిసింది. ఈకాల వ్యవధిలో 56.3మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బొండపల్లి, గంట్యాడ మండలాల్లోను, అత్యల్పంగా పూసపాటిరేగ మండలంలోను వర్షం కురిసింది.వర్షం నేపథ్యంలో పల్లపు భూములు జలమయమయ్యాయి. ముఖ్యంగా పొలాల్లో దిబ్బలుగా ఉన్న వరిచేలు, ఓవులుగా ఉన్న చేను తడిసిపోయింది. ఈ రకంగా సుమారు 238 ఎకరాల్లో వరి చేను ఉండిపోయిందని అధికారుల అంచనా. మరోవైపు ఈ అకాల వర్షంతో వ్యవసాయం, భవన నిర్మాణ తదితర రంగాలకు చెందిన కార్మికుల కూలి పనులు కోల్పోయారు. పట్టణ ప్రాంతాల్లో ఫుట్పాత్ వ్యాపారాలు, తోపుడు బండ్ల వ్యాపారులు కూడా ఉపాధి కోల్పోయారు. కోసిన వరిచేను పొలాల్లో ఉండిపోయిన చోట రైతులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. తడిసి ముద్దయిన చేనును ఒడ్డుకు చేర్చడంలో రైతు కుటుంబాల్లో ఇంటిల్లిపాదీ శ్రమిస్తున్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు 20రోజులకు గాను 7రోజుల పాటు వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 3 మి.మీ కాగా 66.2మి.మీ కురిసింది. అంతకు ముందు రెండు రోజులు వరుసగా 5.3మి.మీ, 9.8మి.మీ చొప్పున వర్షం కురిసింది.

5 శాతం ఉప్పుద్రావణంతో ధాన్యానికి రక్షణ : డిఎఒ

తడిసిన వరిచేనుపై ప్రతి 10 లీటర్ల నీటిలో 500 గ్రాముల (5శాతం ఉప్పు ద్రావణం) ఉప్పును పిచికారి చేసిన చల్లడం ద్వారా ధాన్యం రంగుమారకుండా రక్షించుకోవచ్చని డిఎఒ (జిల్లా వ్యవసాయ శాఖ అధికారి) విటి రామారావు తెలిపారు. ఇప్పటికే కోసిన చేను పంటపొలాల్లో ఉండిన రైతులంతా దీన్ని పాటించాలని విజ్ఞప్తి చేశారు. నూర్పులు చేసిన ధాన్యం బస్తాల్లోనూ, టార్పాలిన్ల కింద, అవకాశం ఉన్న చోట్ల గోడౌన్లు, మిల్లుల్లో కూడా భద్రపర్చారని, ఇంకా ఎవరికైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం తరపున సరఫరా చేస్తున్న టార్పాలిన్లను ఉపయోగించుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1600 టార్పాలిన్లు అందుబాటులో ఉంచగా ఇప్పటికే 800 వరకు రైతులు తీసుకెళ్లారని, మిగిలిన 800లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతు సేవాకేంద్రాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్లను కలిసి వీటిని తీసుకెళ్లవచ్చని, అవసరం తీరాక తిరిగి ఆర్ఎస్కెలకు అప్పగిస్తే సరిపోతుందని తెలిపారు.

238 ఎకరాల్లో తడిసిన వరి

వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం... ఇప్పటి వరకు 238 ఎకరాల్లో చేను పూర్తిగా తడిసిపోయింది. వర్షాలు కొనసాగితే ఈ మేర విస్తీర్ణంలో 460 మెట్రిక్ టన్నుల ధాన్యం రంగుమారే అవకాశం ఉన్నట్టు అంచనాలు వేశారు. ఈ ఏడాది 2,40,580 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో ఇప్పటి వరకు 2,36,590 ఎకరాల మేర కోతలు పూర్తయ్యాయి. మిగిలిన 3,990 ఎకరాలు కోతకు సిద్ధంగా ఉంది. వర్ష సూచన ఉండటంతో అధికారులు హెచ్చరించడంతో కోత నిర్ణయాన్ని రైతులు వాయిదా వేసుకున్నారు. ఇప్పటికే కోసిన వరిలో 1,12,247 ఎకరాల పంట మేర నూర్పులు కూడా పూర్తయ్యాయి. వీటి నుంచి 2,10,772 మెట్రిక్ టన్నుల మేర దిగుబడి రాగా, ఇందులో 2,04,531 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి రైతు సేవా కేంద్రాల సిబ్బంది షెడ్యూలింగ్ కూడా ఇచ్చారు. ఇప్పటి వరకు 1.83లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేశారు. మరో 22,502 మెట్రిక్ టన్నులు రైతుల వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంది.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : కలెక్టర్

విజయనగరంకోట : ధాన్యం తడవకుండా తగిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. నూర్పిళ్లు పూర్తయి సిద్ధంగా ఉన్న సుమారు 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని ఆదేశించారు. వర్షాల కారణంగా జిల్లాలో ఏ ఒక్క రైతుకూ పంట నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. జిల్లాపై వర్షాల ప్రభావాన్ని ఆయన తమ ఛాంబర్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం మండల ప్రత్యేకాధికారులు, క్షేత్రస్థాయిలో తాసిల్దార్లు, ఇతర మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ జిల్లాలో ఇప్పటివరకు సుమారుగా 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నూర్పిళ్లు పూర్తయి సిద్ధంకాగా, వీటిలో ఇప్పటివరకు దాదాపు 1.83 లక్షల టన్నులు కొనుగోలు చేశామన్నారు. ఇంకా సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులవద్ద కొనుగోలుకు సిద్ధంగా ఉందని, తగిన జాగ్రత్తలను తీసుకొని ఈ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సివిల్ సప్లయిస్ అధికారులను ఆదేశించారు. కోతలు పూర్తయి కుప్పలు పెట్టిన పంటను, రెండు రోజులపాటు నూర్పిళ్లు జరగకుండా రైతులను హెచ్చరించాలని సూచించారు. సుమారు 170 ఎకరాల్లో పంటను కోసి, పనలుగా పెట్టారని, అవకాశం ఉన్నంతవరకు వీటిని కూడా వీలైనంతవరకు తడవకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అవసరమైన టార్పాలిన్లు కూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

జిల్లాలో శనివారం కూడా వర్షాలు పడే అవకాశం ఉందని, అన్నివిధాలా అప్రమత్తంగా ఉండాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, సివిల్ సప్లయిస్ డిఎం మీనాకుమారి జిల్లా కేంద్రంనుంచి పాల్గొన్నారు.

క్రీడాంధ్ర ప్రదేశే లక్ష్యం

- నియోజకవర్గాల్లో క్రీడా వసతుల కల్పన
- 2027లో జాతీయ క్రీడల నిర్వహణకు సన్నాహాలు
- రవాణా, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- విజ్జి స్టేడియంలో మల్టీ పర్పస్ ఇండోర్ హాల్ ప్రారంభం



ఇండోర్ హాల్ను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

క్రీడలను ప్రోత్సహించి క్రీడాంధ్ర ప్రదేశ్గా రూపొందించే లక్ష్యంతో దేశంలోనే అత్యుత్తమ క్రీడాపాలసీని తీసుకు వచ్చామని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్ని నియోజక వర్గాల్లో క్రీడా వసతులను కల్పిస్తామని తెలిపారు. నగరంలోని విజ్జి స్టేడియంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన మల్టీ పర్పస్ ఇండోర్ హాల్ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండోర్ హాల్లో కలెక్టర్ అంబేద్కర్, శాప్ ఎమ్డి గిరీశతో కలిసి వారు షటిల్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లలో క్రీడారంగం నిర్వీర్యం అయ్యిందన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రస్తుతం వున్న 2 శాతం రిజర్వేషన్ను 3 శాతానికి పెంచినట్లు పేర్కొన్నారు. వచ్చే జాతీయ క్రీడలను 2027లో అమరావతిలో నిర్వహించేందుకు ప్రణాళిక బద్ధంగా సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడా పాలసీలో భాగంగా విజయనగరంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే అదితి గజపతి మాట్లాడుతూ 1983లో ఈ స్టేడియంను నాటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు ప్రారంభించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో శాప్ ఎమ్డి. గిరీశ, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, డిఎస్డిఒ వెంకటేశ్వర రావు, డిప్యూటీ రవాణా కమిషనర్ మణి కుమార్ పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రులు రాంప్రసాద్రెడ్డి, శ్రీనివాస్

ఆర్టిసికి మంచి రోజులు : మంత్రి

విజయనగరంకోట : ఎపిఎస్ ఆర్టిసికి మంచి రోజులు రానున్నాయని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. త్వరలో ఆర్టిసిలో విద్యుత్తు బస్సులను వేస్తామని తెలిపారు. శుక్రవారం విజయనగరం ఆర్టిసి డిపోలో 10 కొత్త బస్సులకు జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. రెండు బస్సులు విజయనగరం నుండి శ్రీకాకుళానికి కాగా మిగిలినవి అనకాపల్లి, శ్రీకాకుళం డిపోలకు చెందినవి. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టిసి ఉద్యోగులకు నైట్ అవుట్ అలవెన్స్ మంజూరు చేశామన్నారు. ఆర్టిసి ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యతులో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టిసిని నిర్వీర్యం చేసిందన్నారు. ఆర్టిసి జోనల్ చైర్మన్ దున్న దొర మాట్లాడుతూ ప్రయాణికులను గౌరవిస్తూ, వారికి నమ్మకం కలిగేలా పని చేయాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన డ్రైవర్లకు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలను, నగదు పారితోషికాన్ని మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆర్టిసి ఇడి విజయకుమార్ , జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పల నారాయణ, డిప్యూటీ సిటిఎం సుధాబిందు, ఆర్టిసి ఉద్యోగ, కార్మికసంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రికి ఎస్డబ్ల్యుఎఫ్ నాయకుల వినతి

రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఆర్టిసి డిపో ఎస్డబ్ల్యూఎఫ్ నాయకులు పలు సమస్యలపై వినతినిచ్చారు. డిపోలో ఆర్టీసీలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, 1/2019 సర్క్యులర్ను యధావిధిగా అమలు చేయాలని, కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరారు. ఎలక్ట్రానిక్ బస్సులను ఆర్టిసికే ఇవ్వాలని కోరారు.

అమిత్షా వ్యాఖ్యలు దారుణం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దారుణమని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ.. అమిత్షాను వెనకేసుకురావడం భావ్యం కాదన్నారు. మోడీ నాయకత్వంలో బిజెపి మనువాద దృక్పథాన్ని అమలు చేయడానికి అంబేద్కర్పై వ్యాఖ్యలు నిదర్శమన్నారు. మంత్రి వర్గం నుంచి అమిత్షాను తొలగించి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కెల్ల గోవింద, మీసాల లెనిన్, రాము, శ్రీను పాల్గొన్నారు.

మెంటాడ : మండలంలోని జయతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.అప్పలనర్సయ్య, కెవిపిఎస్ నాయకులు దున్న సన్యాసి ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. పదేపదే అంబేద్కర్ను కేంద్రమంత్రి అమిత్షా విమర్శించడం రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించడమేనని వారు తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చాలనే దుర్బుద్ధితో విద్వేషపూరిత వ్యవహారాన్ని చాలా కాలం నుంచి బిజెపి కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ సోములు పెంటయ్య, వార్డ్ మెంబర్ సన్యాసమ్మ, శ్రీను, సోములు, సన్యాసి, రామారావు, కాళిదాసు, లక్ష్మణ, సీతయ్య పాల్గొన్నారు.

అమిత్ షాపై అట్రాసిటీ కేసు పెట్టాలి

వంగర : రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్పై పార్లమెంట్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై అట్రాసిటీ కేసు పెట్టి, తక్షణమే బర్తరఫ్ చేయాలని దళిత బహుజన జెఎసి ఉత్తరాంధ్ర అధ్యక్షులు మజ్జి గణపతి డిమాండ్చేశారు. శుక్రవారం వంగరలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అమిత్షా పార్లమెంట్లో చులకనగా మాట్లాడడం చాలా విచారకరమన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని మార్చడానికి బిజెపి చేస్తున్న కుట్రలో భాగమే అమిత్షా వ్యాఖ్యలని తీవ్రంగా మండిపడ్డారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎం.గణపతిరావు, డి.రాంబాబు, గంగులు, రాజు, బుజ్జి, చిన్న, సింహాచలం, రామారావు, ఉదయ్ రామ్, తదితరులు పాల్గొన్నారు.



మెంటాడ మండలం జయతిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వ్యకాస, కెవిపిఎస్ నాయకులు, దళితులు

విజయనగరం టౌన్ : పార్లమెంట్ లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్బిఆర్ బాబాసాహెబ్ అంబేద్కర్ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేసి, అంబేద్కర్కు క్షమాపణ చెప్పాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్.వి శ్రీకాంత్ డిమాండ్ చేసారు. మంత్రి వ్యాఖ్యలు ఆయన మనువాద ధోరణికి, అంబేద్కర్ పట్ల నిమ్నవర్గాల పట్ల, ఉన్న జాత్యాహంకార ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. దళిత పక్షాన ఉన్నామని చెప్పుకునే బిజెపి అసలురంగు ఈ వ్యాఖ్యలతో బట్టబయలు అయిందని తెలిపారు.



అధ్యయనం.. పోరాటం

- నేడు, రేపు గజపతినగరంలో ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభ
- నాలుగు రోడ్ల కూడలిలో బహిరంగ సభ
- హాజరుకానున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి
- పాల్తేరువారి కల్యాణమండపంలో ప్రతినిధుల సభ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చదువుతూ పోరాడు.... చదువుకై పోరాడు అనే నినాదంతో విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) పోరాడుతోంది. విద్యార్థులు భావి భారత నిర్మాతలంటారు పెద్దలు. ఈ నేపథ్యంలో వీరు నేర్చుకునే విద్యావిధానంపైనే దేశ భవితవ్యం ఉంటుందనడంలో సందేహం లేదు. దీనికితోడు నేర్చుకున్న విద్య అబ్బాలంటే అందుకు తగినన్ని గదులు, తగినందరు ఉపాధ్యాయులు, స్కూళ్లు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు ఉండాలి. వీటి కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో బొబ్బిలి కేంద్రంగా 1980లో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ నేడు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అన్ని మండలాలు, వాటి పరిధిలోని అన్ని స్కూళ్లు, కాలేజీలకూ విస్తరించింది. కేవలం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపైనే కాకుండా విద్యను ప్రైవేటీపరం చేసే నూతన విద్యావిధానంపైనా విద్యార్థులను సమీకరించి పోరాడుతోంది. ఈనేపథ్యంలో జరుగుతున్న 32వ జిల్లా మహాసభలకు ప్రాధాన్యత సంతరించుకుంది.

ఏటా జరుపుకునే జిల్లా మహా సభలో ప్రభుత్వ విద్యావిధానాలు, వాటి పర్యావసానాలతోపాటు పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలు, ఫీజు రీయింబర్స్మెంట్స్ తదితర అంశాలపై చర్చించనున్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గడిచిన ఏడాది కాలంలో విద్యార్థి ఉద్యమం ఎవ్వెత్తున సాగింది. ముఖ్యంగా వసతి గృహాలు, పాఠశాలల్లో తాగునీరు, మెనూ అమలు, మరుగుదొడ్లు, తరగతి గదులు తదితరాల కోసం సుదీర్ఘ ఉద్యమం నడించింది. గజపతినగరం, విజయనగరం కేంద్రాల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగా ఏర్పడినవే. ఆయా కాలేజీలకు సొంత భవనాలు నిర్మించాలని పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎన్నో బెదిరింపులు, నిర్బంధాలు ఎదుర్కొన్నారు. చివరకు విద్యార్థులను ఎస్ఎఫ్ఐలో చేరనీయకుండా పాలకులు విద్యాసంస్థల యాజమాన్యాలపై చేసిన ఒత్తిడి బెడిసికొట్టింది. ఎస్ఎఫ్ఐ పోరాటం.. సంకల్పం మాత్రం మరింత ముందుకే సాగింది. కేవలం విద్యార్థుల సమస్యలపైనే కాకుండా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రహిత విజయనగరం కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించింది. ఇందులో లక్ష మంది విద్యార్థులను భాగస్వామ్యం చేసింది. దీనికి ముగింపుగా జిల్లా కేంద్రంలోని గురజాడ కళాక్షేత్రంలో భగత్సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. మూడు రోజులపాటు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వేలాదిగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం, మేధస్సు, శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించే అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం సైతం శభాష్ అంటూ మెచ్చుకోవడం నిజంగా ఎస్ఎఫ్ఐకి ఒకింత గర్వకారణమే. ఇటువంటి తరుణంలో ఫెడరేషన్ మరో అడుగు ముందుకు వేస్తూ 32వ జిల్లా మహాసభలకు సిద్ధమైంది. ఇందుకు గజపతినగరంలోని పాల్తేరువారి కల్యాణ మండం వేదిక కానుంది. తొలిరోజు శనివారం ఉదయం 10గంటలకు సాయిసిద్దార్థ కాలేజీ నుంచి గజపతినగరంలోని మెంటాడ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. సభకు ముఖ్య అతిధులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ హాజరుకానున్నారు. మహాసభ జరిగే ప్రాంతానికి భగత్ సింగ్ నగర్గాను, ప్రతినిధుల సభ జరిగే స్థలానికి సీతారాం ఏచూరి ప్రాంగణంగా నామకరణం చేశారు. గత కాలపు పోరాటాలు, ఎదురైన సవాళ్లు, నిర్బంధాలు, బెదింపులు వంటి ప్రభుత్వ వైఖరిపై చర్చించడంతోపాటు భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోనున్నారు.

విజయనగరం కార్పొరేషన్కు అవార్డు

స్వీకరించిన కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ఇంధన శాఖ ఆధ్వర్యంలో ఇంధన పరిరక్షణ మిషన్ ప్రకటించిన సిల్వర్ అవార్డును విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శుక్రవారం అందుకున్నారు. విజయవాడలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి కె. విజయానంద్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఇంధన పరిరక్షణ ప్రక్రియలో విశేష సేవలు అందించిన విజయనగరం నగరపాలక సంస్థకు సిల్వర్ అవార్డును ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం అతిధుల చేతుల మీదుగా సిల్వర్ అవార్డును కమిషనర్ పల్లి నల్లనయ్య అందుకున్నారు. తాడిపత్రి పురపాలక సంఘానికి బంగారు పతకం లభించింది. ఈ కార్యక్రమంలో ఎపి జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర బాబు, రాష్ట్ర విద్యుత్ శాఖ సిఎండి పట్టన్ షెట్టి రవి, ఇంధన శాఖ, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఇంధన పరిరక్షణ మిషన్ ఆధ్వర్యంలో విజయనగరం నగరపాలక సంస్థకు సిల్వర్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విశేష సేవలు అందించి సంస్థకు అవార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో విజయనగరం నగరపాలక సంస్థ డిఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కమిషనర్ నల్లనయ్య, డిఇ శ్రీనివాసరావు

డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయింపు

- పిపిఎస్ఎస్ పోరాట విజయం
- శిల్పారామం పక్కన స్థలం ఇవ్వాలి : జిల్లా కార్యదర్శి శంకర్రావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా కేంద్రంలో డిగ్రీ కాలేజికి సొంతభవనం నిర్మించాలని, తాత్కాలికంగా ఖాలీగా ఉన్న ప్రభుత్వ భవనం,లేదా కోటలో లా కళాశాల బిల్డింగ్ అద్దెతీసుకుని డిగ్రీ కాలేజిని మార్చాలని విజయనగరం పట్టణ పౌరసంక్షేమ సంఘం డిమాండ్ చేస్తూ గత కొంత కాలంగా పోరాడుతోంది. డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని కోరుతూ, సంతకాల సేకరణ, విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశామని తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖా మంత్రి లోకేష్కు మెయిల్ ద్వారా వినత పత్రం కార్యక్రమాలు చేసిందన్నారు. దీంతో విద్యాశాఖా మంత్రి లోకేష్ స్పందించి జిల్లా అధికారులతో మంగళవారం మాట్లాడి వివరాలు తెలుసుకుని, వెంటనే గతంలో డైట్ వద్ద మంజూరు చేసిన బిట్ 2 సర్వే నెంబర్ 5,6లో వేణుగోపాలపురం లో గతప్రభుత్వం మంజూరు చేసిన స్థలాన్ని మున్సిపల్ కౌన్సిల్ ద్వారా ఆమోద ముద్ర వేయించి డిగ్రీ కాలేజికి స్థలం కేటాయించారని తెలిపారు. ఇది ప్రజా పోరాట విజయమని తెలిపారు. ఇక్కడ కళాశాల నిర్మాణం జరిగితే విద్యార్థులు వెళ్లి చదువుకునేందుకు దూరం కానుందని, కావున శిల్పారామం వద్ద 20 ఎకరాల్లో కాలేజికి 5ఎకరాలు కేటాయించాలని కోరారు. ఈ దిశగా విద్యాశాఖా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆలోచన చేయాలన్నారు. డిగ్రీ కాలేజికి సొంత బిల్డింగ్ సమస్య పరిష్కరించాలనే కోరుతూ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

గిరిజన సంక్షేమాధికారిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారిగా కె.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతవరకు సాలూరు సహాయ గిరిజన సంక్షేమాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ఇక్కడ డిటిడబ్ల్యూఒగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ను, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని అన్నారు. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.



కలెక్టర్కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గిరిజన సంక్షేమాధికారిగా కె.శ్రీనివాసరావు

నేడు సెంచూరియన్ స్నాతకోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయ నాలుగో స్నాతకోత్సవ వేడుకలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు తెలిపారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవ వేడుకలకు నయంత విశ్వవిద్యాలయ సిఇఒ డాక్టర్ రంజన్ బెనర్జీ ముఖ్య అతిథిగా హాజరవుతారని వివరించారు. ఇంజినీరింగ్, మేనేజ్మెంట్ విభాగాలలో 201 మంది విద్యార్థులకు డిగ్రీలు, ఐదుగురికి పిహెచ్డి, 16 మందికి బంగారు పతకాలు, 8 మందికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ ఛాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి, ఐక్యూఎసి హెడ్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, ప్రొఫెసర్ రమణారావు, డీన్ డాక్టర్ విజయ్ బాబు, డీన్ డాక్టర్ పుష్పలత పాల్గొన్నారు.

సచివాలయంలోకి వర్షపు నీరు



సచివాలయంలో వర్షపునీటిని బకెట్లోకి తోడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని కొండలింగాలవలస గ్రామ సచివాలయం వర్షపునీటితో నిండిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సచివాలయ స్లాబ్, గోడలు బీటలు రావడంతో వాటి నుంచి వర్షపునీరు సచివాలయంలోకి ప్రవేశించింది. టేబుళ్లు, ఫైళ్లు, బీరువాలు తడిసి ముద్దయ్యాయి. బకెట్, జగ్గు, చాటలతో సిబ్బంది నీరు బయటకు తోడారు. ఉద్యోగులు కూర్చునే పరిస్థితి కూడా లేకపోయింది. పగిలిన గోడలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితిలో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

24న బాలుర కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఖోఖో, కబడ్డీ పితామహుడు భగవాన్ దాస్ మాస్టర్ జయంతి సందర్భంగా ఈనెల 24న పాఠశాల స్థాయి బాలురు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని భగవాన్ దాస్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు కమలనాభారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు కెవి బాలకష్ణ 9490663367, గోపాల్ 9494777753 ఫోన్ నెంబర్ లకు ఫోన్ చేసి టీమ్ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న జట్లు విజేతగా నిలిచిన వారికి బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. పోటీలకు వచ్చే క్రీడాకారులకు బోజన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు.

గురుదేవ్ ట్రస్టులో కేన్సర్ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి–కొత్తవలస

మండలంలోని మంగళపాలెం వద్దనున్న గురుదేవ్ చారిటబుల్ ట్రస్టులో ఎన్ఆర్ఐ ఉప్పలపాటి వెంకటపతిరాజు ఏర్పాటు చేసిన కేన్సర్ ఆస్పత్రిని శుక్రవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, అదితి గజపతిరాజు ప్రారంభించారు. వెంకటపతిరాజు సతీమణి విజయశ్రీ జ్ఞాపకార్థంగా ఉప్పలపాటి విజయశ్రీ మెమోరియల్ 100 పడకల కేన్సర్ ఆస్పత్రిని నిర్మించారు. ఉప్పలపాటి వెంకటపతిరాజు, గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జగదీశ్ చేస్తున్న సేవలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి కొత్తవలస, ఎల్.కోట మండలాల అధ్యక్షులు గొరపల్లి రాము, చొక్కాకుల మల్లు నాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షులు కోరుబిల్లి ఉపేంద్ర పాల్గొన్నారు.


ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న ఎస్ఇ లక్ష్మణరావు

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ భవనం ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎం. లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పొదుపు అందరి బాధ్యతని అన్నారు. సభాధ్యక్షులు డిఇ పి.త్రినాధరావు మాట్లాడుతూ ఇంధన పొదుపు ఆవశ్యకతను పిల్లలకు వివరించారు. కార్యక్రమం అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో విజేతలైన పలువురు విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం సర్కిల్ డిజిఎం కెవి లక్ష్మీనారాయణ, ఎస్ఎఒ వి. రాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.మురళికృష్ణ, జి.సురేష్‌బాబు, కెవి సత్యనారాయణ, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

తుప్పల్లోకి దూసుకెళ్లిన బస్సు

ప్రజాశక్తి–గజపతినగరం

మండలంలోని మధుపాడ వద్ద తుప్పల్లోకి శుక్రవారం ఉదయం ఒడిశా ఆర్‌టిసి బస్సు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టమూ లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. విజయనగరం నుంచి జగదల్‌పూర్ వైపు ప్రయాణికులతో ఒఎస్ఆర్‌టిసి బస్సు వెళ్తోంది. మధుపాడ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బస్సు రోడ్డుపక్కనున్న తుప్పల్లోకి దూసుకెళ్లింది. వెంటనే తక్షణ చర్యలు చేపట్టి బస్సును వెలికి తీశారు. ఈ ఘటనలో ప్రయాణికులకు ఏమీ కాలేదు.


తుప్పల్లోకి దూసుకెళ్లిన ఒడిశా బస్సు



డ్వామా పీడీకి ఫిర్యాదు చేస్తున్న కర్రోతు సత్యనారాయణ

ఉపాధి పనులపై ప్రజావేదిక

ప్రజాశక్తి–భోగాపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. డ్వామా పీడీ కళ్యాణ చక్రవర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలను ఆడిట్ సిబ్బంది వివరించారు. కొంతమంది క్షేత్ర సహాయకులు పనికి వెళ్లని వారి పేరిట బోగస్ కార్డులు సృష్టించి వేతనాలు పొందారని సామాజిక తనిఖీ సభ్యులు సింహాచలం వెల్లడించారు. సచివాలయం నిర్మించిన వెండర్ ఖాతాకు కాకుండా ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఖాతాకు రూ.1.15 లక్షలు బిల్లు వేశారని తెలిపారు. ఉపాధి హామీలో అవకతవకలు జరిగాయని టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ.. డ్వామా పీడీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అనూష రెడ్డి, ఎంపిడిఒ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులుగా వలిరెడ్డి

ప్రజాశక్తి–చీపురుపల్లి



వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులుగా వలిరెడ్డి శ్రీనివాసనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం వైసిపి జిల్లా కార్యదర్శిగా ఆయన సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, నియమించినందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి–భోగాపురం

మారుతున్న టెక్నాలజీకి అనుకూలంగా విద్యార్థులు ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఖరగ్‌పూర్ ఐఐటి మాజీ డైరెక్టర్ ఆర్.వి.రాజ్ కుమార్ తెలిపారు. బసవపాలెం వద్దనున్న అవంతి కళాశాలలో బి ద బెస్ట్ వెర్షన్ ఆఫ్ యువర్ సెల్ఫ్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా నిరంతరం చదువుపై దృష్టి పెడితే లక్ష్యాలను సాధించవచ్చన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో పలు రకాల కోర్సులపై నిరంతరం శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ ప్రకాశరావు, కళాశాల ప్రిన్సిపల్ గోవిందరావు, ఎఒ జి.అశోక్ కుమార్, అవంతి విద్యాసంస్థల ప్రతినిధి ఎం.మహేష్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించాలి

ప్రజాశక్తి–బొబ్బిలి

ప్రజలపై మోపిన విద్యుత్తు ఛార్జీల భారాన్ని తగ్గించాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్తు ఛార్జీల పెంపుతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్తు ఛార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ప్రజలను కోరారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి–బొబ్బిలి

ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్‌చేశారు. నకిలీ పట్టాలు తయారు చేస్తున్న వ్యక్తులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

దుస్తులు పంపిణీ

బొబ్బిలి : పట్టణంలోని చేనేత కాలనీ వద్దనున్న నిర్మల్ హృదయ్ మానసిక వికలాంగుల కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు దుస్తులు పంపిణీ చేశారు. జెసి రాజు, మణికంఠ రెడిమేడ్ షోరూం యజమాని శంకరరావు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రూ.32 వేలు విలువైన దుస్తులను 25 మంది బాలబాలికలకు పంపిణీ చేశారు.

ఆహార పొట్లాలు పంపిణీ

బొబ్బిలి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్, మైనారిటీ జిల్లా మాజీ అధ్యక్షులు షేక్ హమీద్ శుక్రవారం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

తడిసి ముద్దయిన వరి

ఆందోళనలో రైతులు


బొబ్బిలి.. వరిచేను తడవకుండా కప్పిన టార్పాలిన్

ప్రజాశక్తి – పూసపాటిరేగ

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వల్ల తీరంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తీరమంతా తడిసి ముద్దయింది. వరి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పూసపాటిరేగ మండలంలోని సుమారుగా 5112 ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారుగా 4750 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. కొంతమేర నూర్పులు అయ్యాయి. సుమారు రెండు వేల ఎకరాల్లో పొలంలోనే వరిచేనంతా రైతులు గాలిదిబ్బలుగా పెట్టారు. ఇవన్నీ వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి. ఇప్పటికే పొలాల్లో నీరు చేరడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలకు దిబ్బలోని పై పొర, కింది పొర ధాన్యం మొలకలు వచ్చేస్తాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి నోటి దగ్గరకు వచ్చిన పంట నేలపాలవుతోందని ఆవేదన చెందుతున్నారు. మండలంలోని మరో 100 ఎకరాల వరకూ వరిపనలు పొలాల్లోనే ఉండిపోయాయి. కొవ్వాడ, వెంపడాం, గుంపాం, గోవిందపురం తదితర గ్రామాల్లో పనలు కుళ్లిపోతున్నాయంటూ రైతులు వాపోతున్నారు. శనివారం కూడా వర్షం ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆవేదన చెందుతున్నారు.

నష్టం ఉంటుంది

మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లో వరిపంట కోతలు పూర్తిచేసి, పొలాల్లో గాలిదిబ్బలు పెట్టుకున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా దిబ్బల పైపొర, కిందిపొర పాడైపోయే అవకాశం ఉంది. ధాన్యం తడిసి మొలకలు వచ్చేస్తాయి. మండలంలో 100 ఎకరాల్లో వరిపనలు పొలాల్లో ఉండిపోయాయి. తడిసిన వరికి లీటరుకు 50 గ్రాముల ఉప్పుకల్లు చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

– నీలిమ, మండల వ్యవసాయ అధికారి, పూసపాటిరేగ

పంటను కాపాడుకోవడానికి పాట్లు

నెల్లిమర్ల : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తడిచిన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వరిపంట కోతలు కోసిన తరువాత వర్షాలు కురవడంతో రైతులు కుప్పలు పెట్టడానికి నానా అవస్థలు పడుతున్నారు. ధాన్యం కొనుగోలులో జాప్యం వల్ల రైతులు పొలాల్లోనే వరి కుప్పలు వేయడం, ఇంతలో వర్షం కురవడంతో చేతికొచ్చిన పంట అందకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో వర్షాలకు తడిచిన వరి పంటను ఎఒ ఎం.పూర్ణిమ, సిఎస్ డిటి ఆర్.శంకరరావు, ఎఇఒ నాగరాజు, విఎఎ శ్యామ్‌కుమార్ పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

పొలాల్లో తడిసిపోతున్న వరికుప్పలు

బొబ్బిలి : కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో గొల్లపల్లి, ఎం.బూర్జవలస, పెంట, రంగరాయపురం, కొత్తపెంట, ఎం.పనుకువలస, తదితర గ్రామాల్లో పొలాల్లో ఉన్న వరి కుప్పలు తడిసిపోతున్నాయి. కళ్లాలు, పొలాల్లో ఉన్న ధాన్యం కూడా తడిసిపోతున్నాయి. వరి కుప్పలు, ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు.


పూసపాటిరేగ.. పొలంలో నీరు చేరడంతో నానుతున్న వరిచేను కుప్పలు

నేలకొరిగిన వరిచేను

వేపాడ : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో వేపాడ మండలం ఆకులసీతంపేట గ్రామంలో వరిచేను నేలకొరిగింది. రెండు రోజులు ఇలాగే కొనసాగితే ధాన్యం మొలకెత్తి, ఎందుకూ పనికిరాకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జగ్గయ్యపేటలో పొలంలో ఉన్న వరిచేను కుప్పలను ఎఒ యశ్వంత్‌కుమార్ పరిశీలించారు. ధాన్యం రంగుమారకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వంటాకు శ్రీను పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలోని వర్షాల కారణంగా తడిచిన వరిచేనును ఎఒ మాధురి శరణ్య పరిశీలించారు. ధాన్యం పాడవకుండా, మొలకలు రాకుండా రైతులకు సూచనలు చేశారు.




కొత్తవలస, నెల్లిమర్ల, వేపాడ మండలాల్లో తడిసిన వరిచేను పరిశీలించి, రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

తీరంలో తాబేళ్ల మృత్యుఘోష

గుడ్లు పెట్టేందుకు వచ్చి మృత్యువాత పడుతున్న భారీ సరీసృపాలు ● ప్రతిరోజూ తీరానికి కొట్టుకువస్తున్న కళేబరాలు

ప్రజాశక్తి–భోగాపురం

భూమిపై, సముద్రంలో జీవులకు రక్షణ లేకుండా పోయింది. మానవ తప్పిదాలు, పెరుగుతున్న కాలుష్యంతో తీరంలో తాబేళ్ల మృత్యుఘోష వినిపిస్తోంది. సముద్ర తీరప్రాంతాల్లో గుడ్లు పెట్టేందుకు వస్తున్న తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో వాటి కళేబరాలు తీరానికి నిత్యం కొట్టుకొస్తున్నాయి. గత కొద్దిరోజులుగా నిత్యం పదుల సంఖ్యలో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల కళేబరాలు తీరానికి కొట్టుకురావడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం

జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో సుమారు 28 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. ఏటా నవంబర్, డిసెంబర్‌లో తాబేళ్లు గుడ్లు పెట్టే సీజన్. ఈ సీజన్‌లో తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తుంటాయి. గడ్లు పెట్టిన తరువాత సంబంధిత సిబ్బంది ఆ గుడ్లను సేకరించి, తీరంలో ఒకపాక వేసి అక్కడ ఇసుకలో పెడతారు. దానిపై గుడ్లు పెట్టిన తేదీని నమోదుచేస్తారు. పిల్లలు పొదిగిన తరువాత వాటిని సముద్రంలోకి వదులుతుంటారు.

తీరానికి గత నెల రోజుల నుంచి తాబేళ్ల కబేరాలు కొట్టుకొస్తున్నాయి. ఒక్కో తాబేలు సుమారు 20 కిలోలపైనే ఉంటుంది. అంటే ఎంత పెద్ద తాబేలో ఇట్టే అర్థమవుతోంది. ఇలా 28 కిలోమీటర్ల మేర విస్తరించిన తీరానికి నిత్యం ఐదు నుంచి పది తాబేళ్ల కళేబరాలు కొట్టుకొస్తున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. వందకుపైగా తాబేళ్లు మృతిచెందాయి. చనిపోయిన తాబేళ్ల కళేబరాలను కనీసం ఖననం కూడా చేయడం లేదు. దీంతో వీటిని కుక్కలు, కాకులు పీక్కు తింటున్నాయి. ఇవి కుళ్లిపోయి కంపుకొడుతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.

కారణం ఇదేనా?

తాజాగా గురువారం భోగాపురం మండలంలోని ముక్కాం, చేపలకంచేరు తీరానికి ఎనిమిది తాబేళ్ల కళేబరాలు కొట్టుకొచ్చాయి. విచ్చలవిడిగా పరిశ్రమలు, హేచరీల నుంచి సముద్రంలోకి వ్యర్థాలను వదిలేయడంతో తాబేళ్లు మృతిచెందుతున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. మరోవైపు టేకు వలలకు చిక్కుకొని, పెద్దబోట్లకు తగలడం వల్ల ఇవి మృత్యువాత పడుతున్నాయని అంటున్నారు. గత కొద్దిరోజులుగా నిత్యం పదుల సంఖ్యలో భారీ సరీసృపాలు మృతిచెందడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి–రేగిడి

అపరిష్కృతమైన భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో అర్జీలు చేసుకున్న రైతులకు పరిష్కారం దిశగా కృషి చేస్తామని తహశీల్దార్ ఎన్.చిన్నారావు అన్నారు. లచ్చన్నవలస, తాటిపాడు పంచాయతీల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రేవతి, నాయకులు రాధాకృష్ణ పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో సింగరాయి, సోంపురం గ్రామాల్లో శుక్రవారం తహశీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యాన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సింగరాయిలో 9, సోంపురంలో 6 దరఖాస్తులు మ్యుటేషన్ల కోసం వచ్చాయి. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ఉపతహశీల్దార్ డి.సన్యాసినాయుడు, సర్పంచ్ ఎన్.వెంకటరావు, విఆర్ఒలు సత్యవతి, అప్పలరాము, కార్యదర్శులు సత్యవతి, శ్రీనివాసరావు, నాయకులు ఎన్.కామేష్ తదితరులు పాల్గొన్నారు.


వేపాడ.. మాట్లాడుతున్న తహశీల్దార్ రాములమ్మ

రహదారులు జలమయం


బొబ్బిలి.. రాజా కళాశాల సమీపంలో చెరువును తలపిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి–బొబ్బిలి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలో గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయ జంక్షన్ వరకు రోడ్డుపై ఉన్న గుతుల్లో నీరు చేరింది. దీంతో ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. పూల్‌బాగ్, రాజా కళాశాల సమీపంలో రోడ్డుపై పెద్ద గోతులు ఉండడం, వాటిలో వరదనీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై గోతులను పూడ్చాలని ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు కోరుతున్నారు.

పట్టణంలో కమిషనర్ పర్యటన

అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడంతో పట్టణంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి పర్యటించారు. పూల్‌బాగ్ రోడ్డులో గోతులను పరిశీలించారు. మేదరబంద, కూరగాయల మార్కెట్, పూల్‌బాగ్ ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో కారిపోతున్న షాపులను పరిశీలించి, వాటికి మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

రోడ్డుపై నిలిచిన నీరు

శృంగవరపుకోట : శుక్రవారం ఉదయం నుండి కురుస్తున్న వర్షానికి పట్టణంలోని విశాఖ– అరకు రహదారిపై భారీగా నీరు నిలిచిపోయింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గతంలో ఇదే సమస్య రావడంతో పంచాయతీ సిబ్బంది స్పందించి వర్షపు నీరు దిగువకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఆ కాలువలను స్థానిక దుకాణదారులు మళ్లీ ఆక్రమించడంతో సమస్య మొదటికొచ్చింది.


శృంగవరపుకోట పట్టణంలో ప్రధానరహదారిపై చేరిన నీరు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి–విజయనగరంకోట



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీసులకు ఎస్‌పి వకుల్‌జిందాల్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రూరల్ పోలీసుస్టేషన్‌ను ఎస్‌పి పరిశీలించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన ప్రావర్టీ వివరాలను ప్రాపర్టీ రిజిష్టరు నందు నమోదు చేయాలని, అవసరం లేని వాహనాలను రిలీజ్ చేసి, యజమానులకు అప్పగించాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణ, వినియోగం, విక్రయాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దర్యాప్తులో ఉన్న చోరీ కేసులను ఛేదించే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆయా కేసుల్లో నిందితులను గుర్తించి, అరెస్టులు చేసి, చోరీ సొత్తును తిరిగి రికవరీ చేయాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణరు ప్రజల్లోను, యువతలోను చైతన్యం తీసుకొని వచ్చేందుకు 'సంకల్పం' కార్యక్రమాను చేపట్టి, అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం, మహిళా సంరక్షణ పోలీసులు, పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ఎస్ఐ అశోక్ కుమార్, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా పోలీసుశాఖలో పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌పి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

వరి రైతులకు జాగ్రత్తలు

ప్రజాశక్తి–పూసపాటిరేగ

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో వరిచేనంతా తడిసి ముద్దయింది. వరికుప్పలు వేసినా, పైపొర, కిందిపొర తడవడంతో ధాన్యం రంగుమారి, మొలకెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులకు వ్యవసాయ శాఖ ఎడి నాగభూషణం పలు సూచనలు చేశారు. వరిచేను, ధాన్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆ వివరాలు..

కోసిన పూర్తిగా ఆరని వరిపనలను తుపాను వాతావరణ నేపథ్యంలో కుప్పలు వేసినప్పుడు... ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే, గింజ మొలకెత్తకుండా ఉండడానికి లీటరు నీటికి 50 గ్రాముల చొప్పున కల్లు ఉప్పు కలిపి పనలపై పడేలా పిచికారీ చేయాలి. పొలంలో నీరు నిలిచి ఉంటే, పనలను గట్ల పైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలు తిరగేసి ఎండబెట్టి, నూర్పిడి చేయాలి. నూర్చిన ధాన్యం 2–3 రోజులు ఎండబెట్టడానికి వీలు కాకుంటే కుప్పలలో గింజ మొలకెత్తడమే గాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి క్వింటా ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగుపెట్టడం వల్ల మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పార బట్టి నిలువ చేసుకోవాలి. రంగు మారి, తడిచిన ధాన్యం.. పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చు.

పిగులు పొట్ట, పూత దశలో ఉన్న పైరు ఒకట్రెండు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే కంకి పూర్తిగా బయటకు రాదు. పుష్పాలలో నీరు చేరడం వల్ల ఫలదీకరణ శక్తి కోల్పోయి తాలు, రంగు మారిన గింజలు ఏర్పడతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజిం లేదా రెండు గ్రాముల కార్బండిజిం, మాంకోజెట్ లేదా ఒక మిల్లీలీటర్ ప్రొపికొనజోల్ మందును పిచికారీ చేయాలి.

పాలు పోసుకునే దశ

ఈ దశలో 2 నుండి 3 రోజుల కన్నా ఎక్కువగా పంట నీట మునిగితే పిండి పదార్థాలు గింజలలో చేరక బరువు తగ్గి, రంగు మారుతాయి. తద్వారా దిగుబడి, నాణ్యత తగ్గుతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి గ్రాము కార్బండిజిం లేదా రెండు గ్రాముల కార్బండిజిం, మాంకోజెట్ లేదా మిల్లీలీటరు ప్రొపికొనజోల్ మందును పిచికారీ చేయాలి.

– గింజ గట్టిపడే దశ నుంచి కోత దశలో చేను పడిపోకుండా ఉండి, నిద్రావస్థ కలిగిన రకాలతో నష్టం తక్కువగా ఉంటుంది. నిద్రావస్థ లేనటువంటి బి.పి.టి 5204 వంటి రకాలు నీటమునిగితే గింజ మొలక వచ్చి నష్టం ఎక్కువగా ఉంటుంది. నిద్రావస్థ ఉన్న రకాల్లో కూడా చేను పడిపోయి వారం రోజులకన్నా ఎక్కువగా నీట మునిగితే గింజల్లో నిద్రావస్థ తొలిగి చేనుపైనే మొలకవచ్చే అవకాశం ఉంది.

– గింజ తోడుకునే లేదా గట్టిపడే దశలో వెన్ను బరువువల్ల మొక్కలు కొద్దిపాటి గాలి వర్షాలకు కణుపుల వద్ద ఒరిగి నేలకొంగుతాయి. ఇలా పడిపోవడం వల్ల పిండి పదార్థం గింజలకు సరిగా చేరక గింజ బరువు తగ్గడం లేదా తాలు గింజలు ఏర్పడటం, తద్వారా దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దీంతోపాటు పడిపోయిన చేల నుంచి వచ్చే ధాన్యం రంగు మారి, మిల్లింగ్ సమయంలో విరిగిపోయి, బియ్యంపై మచ్చ వచ్చే అవకాశం ఉంది. పడిపోయిన చేలలో యంత్రాలతో కోత కోయడానికి ఎక్కువ సమయం పట్టడం వల్ల కోత ఖర్చు కూడా పెరిగిపోతుంది. నష్టనివారణకు పడిపోయిన చోట వీలైనంత తొందరగా దుబ్బులను లేపి నిలబెట్టి కట్టలుగా కట్టాలి.


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు